ఏర్పాట్లను పరిశీలిస్తున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

పన్నుల శాఖలో... పైసా వసూల్



ముడుపులు ఇస్తే జీరో బిజినెస్‌కు ఓకే
పరిశ్రమలు, మిల్లులు, దుకాణాల నుంచి మామూళ్లు
జీఎస్టీ ఎగవేతకు సంపూర్ణ సహకారం

ప్రజాశక్తి-హిందూపురం

వాణిజ్య పన్నుల శాఖ... వసూళ్ల శాఖగా మారిపోయిందన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. సరిహద్దుల్లో ఉన్న తనిఖీ కేంద్రంలో ఎత్తివేయడం, జీఎస్టీ అమలు వీరికి బాగా కలిసి వచ్చిందన్న వాదనలున్నాయి. హిందూపురం వాణిజ్య పరంగా అభివద్ధి చెందడం, సరిహద్దులో ఉండడంతో వాణిజ్య పన్నుల అధికారుల వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారన్న చర్చ సాగుతుంది. గతంలో ఏసీబీ అధికారులకు ఒక అసిస్టెంట్ కమిషనర్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఒక అటెండర్ మొత్తం నలగురు పట్టుబడమే దీనికి నిదర్శనం. దీంతో పాటు అసిస్టెంట్ కమిషనర్ భాధ్యతలను స్వీకరించిన అనంతరం పెద్ద ఎత్తున పట్టణంతో పాటు హిందూపురం సర్కిల్ పరిధిలో పెద్ద ఎత్తున వసూళ్ల చేపట్టారు. డీలర్లు ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేయడంతో డిప్యూటీ కమిషనర్‌ను విచారణ కోసం అధికారులు ఆదేశించారు. ఆయన సైతం తూతూ మంత్రంగా విచారణ చేసి మూసి వూయాలని చూస్తున్నారు అంటే ఎంత పెద్ద మొత్తంలో అవినీతి జరిగిందో అర్థం చేసుకోవచ్చు

వాణిజ్య పన్నుల శాఖలో కొందరు అధికారులు బంపర్ ఆఫర్ ఇస్తున్నారు. ముడుపులు ఇస్తే చాలు.. ఎంతైనా జీరో బిజినెస్ చేసుకోవచ్చు. హిందూపురం పట్టణంలో కొన్ని రంగాల వ్యాపారులతో వీరు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. వ్యాపారులు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ఎగవేసి పన్నుల శాఖ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఆ శాఖ హిందూపురం వాణిజ్య కార్యాలయ పరిధిలో అక్రమాలకు అంతులేకుండా పోతోంది. ఇక్కడ కొంత మంది ఏసీటీవోలు చక్రం తిప్పుతున్నారు. వారి చూపంతా జీరో బిజినెస్ చేసే వ్యాపారులపైనే ఉంటోంది. కొబ్బరి, చక్కర వ్యాపారులు మొదలుకొని బంగారు దుకాణాల వరకు, పారిశ్రామిక వాడలోని స్టీల్ పరిశ్రమ నిర్వాహకులు పెద్ద ఎత్తున ముడుపులు ఇస్తున్నారని సమాచారం. హిందూపురం పట్టణంలో ఒక్క ముదిరెడ్డి పల్లిలోనే పట్టు చీరల వ్యాపారం రోజుకు సుమారు రూ. 5కోట్ల వరకు జరుగుతుంది. దీంతో పాటు పట్టణం లోని మెయిన్ బజారులో ఉన్న బంగారు దుకానాలతో పాటు వివిధ బట్టలు ఇతర దుకాణాల్లో సుమారు కోటి రూపాయల వరకు వ్యాపారాలు జరుగుతాయి. వాటితో పట్టణంలో ఇతర ప్రాంతాల్లో ఉండే జనరల్ స్టోర్స్, ఫర్టిలైజర్ షాపులు, బంగారు దుకాణాలు, నూనె వ్యాపారులు, ముక్కడి పేటలో ఉన్న బట్టల దుకాణాలు, తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలో ఉన్నా పరిశ్రమలతో పాటు ఇతర వ్యాపార రంగాల నుంచి రోజుకు కోట్లల్లో వ్యాపారాలు జరుగుతున్నాయి. ఇవన్ని జీరో బిజినెస్ భారీగా సాగుతోందని ఆరోపణలు ఉన్నాయి. కొంత మది ఎసిటఒల చూపంతా వాటిపై పడింది. వారు ప్రభుత్వానికి పన్నులు చెల్లించక పోయిన, వారికి చెల్లించే ముడుపులు మాత్రం సకాలంలో అందే విధంగా చూసుకుంటూ ప్రభుత్వానికి రోజుకు లక్షల్లో ఆదాయం రావాల్సి ఉన్నా వాటికి గండి కొడుతున్నారు.

చీకటి పడితే దిగుమతులే.....

హిందూపురం పట్టణం సరిహద్దులో ఉండడంతో చీకటి పడితే చాలు దిగుమతులు జోరందుకుంటాయి. ప్రతి రోజు పక్కన ఉన్న కర్నాటక రాష్ట్ర రాజధాని బెంగళూరు నుంచి కోట్లాది రూపాయాల సరుకులు ఎటువంటి బిల్లులు లేకుండా వానిజ్య పన్నుల శాఖ కార్యాలయం పక్కనే అన్‌లోడ్ చేస్తుంటారు. దీనిపై పాత్రికేయులు ఆధారాలతో సహ ఫిర్యాదు చేసినప్పటికి వారిపై కనీస చర్యలు తీసుకోదు. ఇతర రాష్ట్రాలకు చెందిన కొంత మంది బెంగళూరు నుంచి కల్తీ ఆహార పధర్థాలను దిగుమతి చేసుకుని, బ్రాండెండ్ పేరుతో విక్రయిస్తున్నారు. ఇతర రాష్ట్రలకు చెందిన ఏ దుకాణాదారుడు ఏ ఒక్కరికీ బిల్లులు ఇవ్వరు. ఇలాంటి దుకాణాలు పట్టణంలో వందల్లో ఉన్నాయి. ఒక దుకాణానికి రోజుకు కనీసం ఒక లక్ష రూపాయల వ్యాపారం జరిగిన సుమారు రోజుకు ఒక కోటి రపాయల వరకు జీరో వ్యాపారం జరుగుతుంది. ఇదందా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయానికి అతి సమీపంలోనే జరుగుతున్నా చర్యలు శూన్యం. జీఎస్టీ అమలులోకి వస్తే అక్రమాలకు చెక్ పడుతుందని ప్రభుత్వం భావించింది. అయితే జీఎస్టీ అధికారుల పాలిట కల్పవక్షంగా మారింది. హిందూపురంలో జీరో వ్యాపారం జోరుగా సాగుతున్నా నియంత్రణ కరువైంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దీనిపై నిఘా ఉంచితే అసలు వాస్తవాలు బహిర్గతం అవుతాయని పలువురు పేర్కొంటున్నారు.

కర్నాటక నుంచి బిల్లులు లేకుండా తీసుకొచ్చిన వస్తువులను అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

బాలోత్సవానికి వేళాయే..!

అనంతలో నేటి నుంచి పిల్లల పండుగ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'అనంత బాలోత్సవం' పేరుతో ఏటా నిర్వహించే పిల్లల పండుగ నేటి నుంచి మూడు రోజులపాటు జరుగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను అనంత బాలోత్సవ కమిటీ పూర్తి చేసింది. ఈనెల 14 నుంచి 16వ తేది వరకు మూడు రోజులపాటు నగరంలోని లలిత కళాపరిషత్‌లో అకడమిక్, కల్చరల్ విభాగాల్లో పోటీలు సాగనున్నాయి. అనంత బాలోత్సవం పేరుతో ఏటా సాగుతున్న ఈ పోటీలు ఈసారి ఐదవసారి జరుగనున్నాయి. ఈ పోటీల్లో ఇప్పటి వరకు వందకుపైగా స్కూల్ తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు బాలోత్సవ కమిటీ నిర్వహకులు తెలిపారు. ప్రతి రోజూ మూడు వేల మంది వరకు విద్యార్థులు పోటీల్లో పాల్గొననున్నారు. 60 విభాగాల్లో ఈ పోటీలు సాగనున్నాయి. ఎక్కడా విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా ఉండే విధంగా బలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధ్యక్షురాలు షమీమ్ షఫీవుల్లా, కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి, కోశాధికారి జిలాన్ తెలియజేశారు.

లలిత కళాపరిషత్ వేదికగా కార్యక్రమాలు

అనంత బాలోత్సవం కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి అంటే గడిచిన నాలుగు కార్యక్రమాలు అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరుగుతూ వచ్చేవి. ఈసారి వేదిక మార్పు జరిగినట్టు బాలోత్సవ కమిటీ ఇది వరకే ప్రకటించింది. నగరంలోని లలిత కళాపరిషత్‌లో ఈ కార్యక్రమాలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ విషయాన్ని పోటీల్లో పాల్గొనే విద్యార్థులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు గమనించాలని నిర్వాహకులు సూచించారు.

నేడు జరిగే పోటీలు

ఈనెల 14వ తేదీన శుక్రవారం నాడు ఆకడమిక్‌లో చిత్రలేఖనం, మెమోరీ టెస్టు, కార్టూన్, వ్యాస రచన, తెలుగు, ఇంగ్లీషు, కథా విశ్లేషణ, దిన పత్రిక పఠనం, కథా రచన, కవితా రచన, వ్యాస రచన, స్పెల్ బి, సైన్సు ఎగ్జిబిషన్, వెస్టు టు బెస్టు ఈ విభాగాల్లో జూనియర్, సీనియర్స్ రెండు విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి.

కల్చరల్‌లో : ఇక కల్చరల్‌లో జానపద గీతాలాపన, దేశ భక్తి గీతాలాపన, లఘునాటికలు, విచిత్ర వేషధారణ, ఫ్యాన్సీ డ్రస్ ఉండనున్నాయి. వీటిల్లోనూ సీనియర్, జూనియర్ విడివిడిగా ఉండనున్నాయి. ఈ పోటీల్లో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల్లోపు ముగిసే విధంగా ఏర్పాట్లు చేసియున్నారు. వచ్చే విద్యార్థులకు అవసరమైన భోజన, నీటి వసతిని కల్పించినట్టు నిర్వాహకులు తెలిపారు.

ప్రాంగణాలకు ప్రముఖుల పేర్లు

లలిత కళాపరిషత్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, గిల్డ్ ఆఫ్ సర్వీస్‌లో అకడమిక్ ఈవెంట్స్ జరగనున్నాయి. లలిత కళాపరిషత్ సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి స్టేజ్ 1కు లలితకళాపరిషత్ పూర్వపు కార్యదర్శులు కె.నరసింహమూర్తి, గాజుల నారాయణస్వామి ప్రాంగణం, స్టేజ్-2కు సంగీత విద్వాంసుడు పద్మశ్రీ జాకీర్ హుస్సేన్ ప్రాంగణం, స్టేజ్-3కు బుర్రకథ పితామహుడు పద్మశ్రీ షేక్ నాజర్ ప్రాంగణం, స్టేజ్-4కు మహిళా ఉద్యమ నాయకురాలు శకుంతలమ్మ ప్రాంగణం, స్టేజ్-5కు సీనియర్ పాత్రికేయుడు నందినేని దేవప్రసాద్ ప్రాంగణంగా నామకరణం చేశారు. అనంత బాలోత్సవం కమిటీ, గిల్డ్ ఆఫ్ సర్వీస్ సంయుక్త ఆధ్వర్యంలో సరోజిని నాయుడు ప్రాంగణంలో అకడమిక్ ఈవెంట్స్ జరగనున్నాయి. శుక్రవారం ఉదయం 10 గంటలకు జెఎన్‌టియు విసి సుదర్శన్‌రావు, డిఇఒ ఎం.ప్రసాద్‌బాబులు ముఖ్య అతిథులుగా హాజరై బాలోత్సవాలను ప్రారంభిస్తారని బాలోత్సవ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు.

కూటమి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి

మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-తాడిమర్రి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని మరువపల్లి గ్రామంలో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాతూ ధర్మవరం నియోజకవర్గం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు చెప్పారు. తన ఆదరించిన ప్రజల రుణం తీర్చుకుంటానని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం రైతులకు కనీసం ట్రాన్స్‌ఫార్మర్లు కూడా మంజూరు చేయలేదన్నారు. రైతులకు ఏ కష్టం వచ్చినా తక్షణం ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం అందుబాటులో ఉంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ యాదవ్, కురుబ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ గంగలకుంట గోపాల్ రెడ్డి, నాయకులు చింతల వన్నూర్ రెడ్డి, సంధి రెడ్డి శ్రీనివాసులు, బిజెపి ఆఫీస్ ఇన్‌ఛార్జి హరీష్ బాబు, టిడిపి మండల కన్వీనర్ కూచి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

వాటర్ ఏటీఎం ప్రారంభం

మండల పరిధిలోని శివంపల్లి గ్రామంలో జల్ జీవన్ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు సరఫరా చేయడంలో భాగంగా కోకాకోలా బేవరేజెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎటిఎం వాటర్ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు.

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 104 ఉద్యోగుల సంఘం నాయకులు అశోక్ కుమార్ ఎం.చంద్ర ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు.

విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించం : మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని, అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో గురువారం మంత్రి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తుందన్నారు. అధికారులు అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో ఆటంకాలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం శాఖల వారీగా అధికారులతో చర్చించారు. సమావేశంలో ఆర్డీవో ఆనంద్ కుమార్, తహశీల్దార్లు, ఎంపిడిఒలు హౌసింగ్, విద్యుత్, ఇరిగేషన్, ఉద్యానవనం, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని వినతి

పట్టణంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ ఆధ్వర్యంలో బహుజన చైతన్య వేదిక సభ్యులు మంత్రి సవితకు వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ భవన నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు 50 సెంట్ల భూమిని కేటాయిం చారని, అందుకు సహకారం అందించాలని వారు మంత్రిని కోరారు. అలాగే నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలల్లో వసతులను మెరుగుపరిచి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని మంత్రిని కోరారు. వాటిపై మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

మంత్రికి వినతి పత్రం ఇస్తున్న బహుజన చైతన్య వేదిక సభ్యులు

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి మహేష్

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి : డీఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంతో పాటు లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో ప్రతి ఒక్కరూ షాపులు, గృహాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డిఎస్‌పి మహేష్ తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో సిఐలు ఆంజనేయులు, రాజగోపాల్ నాయుడు, జనార్ధన్‌తో కలిసి డిఎస్‌పి మహేష్ పలు వివరాలను వెల్లడించారు. సిసి కెమోరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల వారి ప్రాంతాలతో పాటు ఇంట్లో, షాపులలో ఏ చిన్న సంఘటన జరిగిన వాటి పుటేష్ ఆధారంగా కేసులను పరిష్కరించడానికి సాధ్యం అవుతుందన్నారు. ప్రజలు నూతన సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిసి రెమోరాలను ఏర్పాటు చేసుకునే వారు వారి ప్రాంత సిఐలకు సమచారం ఇవ్వాలని కోరారు.

మడకశిర సిఐపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో సిఐగా పని చేస్తున్న రాగిరి రామయ్యను సస్పెండ్ చేస్తూ గురువారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన జిల్లాలోని కొత్తచెరువు, పుట్టపర్తి రూరల్ సిఐగా పని చేస్తూ పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఇటీవలే మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో సిఐగా నియమితులయ్యారు. ఈయనకు సంబంధించి పుట్టపర్తి, మడకశిర ప్రాంతాల్లో జరిగిన కొన్ని సమస్యాత్మక సంఘటనలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపిన ఎస్పీ సిఐను వారం రోజుల క్రితమే విఆర్‌లో ఉంచారు. అలాగే సిఐపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టి నిజానిజాలను పరిశీలించి సిఐని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు గురువారం ఆదేశాలు జారీ చేశారు.

పెండింగ్ రికార్డులను నాలుగు రోజుల్లో పూర్తిచేయాలి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పెండింగ్‌లో ఉన్న రికార్డులను నాలుగు రోజుల్లోపు పూర్తి చేయాలని, ఎంఎస్ఎంఈ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టర్ గురువారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, డిజిటల్ పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు డిపిఒ సమత, సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, పరిశ్రమల జిఎం నాగరాజు, చేనేత శాఖ ఎడి రామకృష్ణయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో వివిధ మండలాల్లో పౌరుల డేటా, తప్పిపోయిన వారి పురోగతిని మెరుగుపరచాలని లేకుంటే సంబంధిత ఎంపిడిఒలకు మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. పుట్టపర్తి అర్బన్‌లో 1,177 మంది పౌరుల డేటా పెండింగ్‌లో ఉందన్నారు. తనకల్లులో 2,193 రికార్డులు ఉన్నాయని, కనగానపల్లి, పరిగి మండలాల్లో రికార్డులు పెండింగ్‌లో ఉన్నాయని నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. హిందూపురం అర్బన్‌లో ఆరోగ్యశ్రీ కార్డుల్లో ఉన్న పౌరుల డేటా ఎక్కువగా ఉందన్నారు. 0-6 ఏళ్ల వయస్సు ఉన్న ఆధార్ లేని పిల్లల ఆధార్ కార్డు ఇప్పించాల్సిన బాధ్యత మీపై ఉందని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. తడి, పొడి చెత్త, హానికరమైన డస్ట్ బిన్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ఎఫ్ఎన్ఓ లేక బాధితులే కట్లు కట్టుకుంటున్న దుస్థితి

ఆసుపత్రిలో ఎఫ్ఎన్ఒ లేక అవస్థలు

రొద్దం : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గాయాలకు కట్లు కట్టే వారు లేక బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో బాధితుల సహాయకులే కట్టు కట్టుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఎఫ్ఎన్ఒ ఏడాది క్రితం డిప్యుటేషన్‌పై పెనుకొండ ఆసుపత్రికి వెళ్లగా అప్పటి నుంచి ఇక్కడ గాయాలకు కట్లు కట్టేవారు లేరు. దీంతో గాయాలతో ఆసుపత్రికి వచ్చిన బాధితులకు కట్లు కట్టేవారు లేక బాధితుల సహాయకులే వారికి వచ్చినంత మాత్రం కట్టు కట్టుకొని వెళ్తున్నారు. అలాగే ఆసుపత్రికి వచ్చిన మందులు, ఇతర స్టాక్‌ను ఫార్మాసిస్ట్ గదిలో కాకుండా ఆసుపత్రి వరండాలో బండలపై పెట్టడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎఫ్ఎన్ఓ పోస్టును భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి : ఛైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

సచివాలయ ఉద్యోగులు, నాయకులు సమన్వయంతో వ్యవహరించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ సూచించారు. గురువారం తన ఛాంబర్‌లో మున్సిపల్ పరిధిలోని 6, 4,3 సచివాలయంలో పనిచేస్తున్న వార్డు కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు వీధుల్లో చెత్తా చెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వార్డుల్లో నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. తాను ఆకస్మిక పర్యటనలు చేసి పరిశీలన చేస్తానని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వార్డుల్లో రహదారులు, మురికి కాలువల ఏర్పాటుకు సంబంధించి సమగ్రమైన వివరాలను తయారుచేసి అందజేయాలని అమ్యూనిటీస్ కార్యదర్శులకు తెలిపారు. అక్రమ కట్టడాలు లేకుండా జాగ్రత్త వహించాలని ప్లానింగ్ కార్యదర్శులకు సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు లేకుండా చూడాలని, ప్రభుత్వ పథకాలు అర్హులు అందరికీ అందేలా చూడాలని పలు అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, 6 వ వార్డ్ బూత్ కన్వీనర్లు అశ్వర్థ నారాయణ, షబ్బీర్, వార్డు ఆర్పీలు పాల్గొన్నారు.

సచివాలయ సెక్రటరీలతో సమీక్షిస్తున్న ఛైర్మన్ రమేష్ కుమార్

పార్టీలకతీతంగా సిఎంఆర్‌ఎఫ్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

కూటమి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సిఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థికసాయం అందజేస్తుందని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. రామగిరి మండలంలోని వెంకటాపురం గ్రామంలో గురువారం ఆమె తన క్యాంప్ కార్యాలయంలో రాప్తాడు నియోజకవర్గంలోని పలువురికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. వారిలో చెన్నేకొత్తపల్లి మండలంలోని వెంకటంపల్లికి చెందిన చీమల తిప్పన్నకు రూ. 1,76,683, మేడాపురం గ్రామానికి చెందిన రాజేంద్రప్రసాద్‌కు రూ. 3,99,000, పెద్ద మొగలాయపల్లికి చెందిన లింగమయ్యకు రూ. 2,55,524, రామగిరి మండలంలోని కలికివాండ్లపల్లికి చెందిన యనుమల పోతులయ్యకు రూ. 1,43,760 చొప్పున మొత్తం రూ. 9,74,982 చెక్కులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు అత్యవసరమైన విద్య, వైద్యసేవల్లో రాజకీయాలు ఉండవని, అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వ పథకాలు తప్పనిసరిగా అందిస్తామని తెలిపారు.

అంగన్వాడీ పోస్టులకు సజావుగా ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం డివిజన్ పరిధిలోని ధర్మవరం, బత్తలపల్లి, చెన్నేకొత్తపల్లి ప్రాజెక్టులకు సంబంధించి అంగన్వాడీ వర్కర్స్, ఆయాల పోస్టులకు గురువారం పట్టణంలోని ఆర్డీవో కోర్టు కార్యాలయ ఆవరణలో ఇంటర్వ్యూలు సజావుగా జరిగినట్లు ఆర్డీవో మహేష్ తెలిపారు. ఆర్డీవో మాట్లాడుతూ మొత్తం 3 మండలాల్లో 161 దరఖాస్తులు రాగా 69 మందిని సిడిపిఒ తిరస్కరించారు. మిగిలిన 92 మందిలో ఇంటర్వ్యూలకు 74 మంది హాజరయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హుల ప్రగతి వివరాలను పొందుపరిచి కలెక్టరేట్‌కు నివేదికను పంపామని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా మండలాల్లో ఎంపికైన వారి పేర్లతో జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిడిపిఒలు లక్ష్మి, కవిత, సరస్వతి, మహిళా అభ్యర్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూ చేస్తున్న ఆర్‌డిఒ మహేష్

పాఠశాల సముదాయాల వేళల్లో మార్పు సరికాదు

ప్రజాశక్తి-మడకశిర

పాఠశాల సముదాయాల వేళలలో మార్పు సరికాదని, పాత పద్ధతిలోనే నిర్వహించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఎపి ఎస్‌టిఎ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.మారుతి ప్రసాద్, పి..జయకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాఠశాల సముదాయ సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులు ఉదయం 11.45 గంటల వరకూ పాఠశాలల్లో తరగతులు నిర్వహించి, మధ్యాహ్నం భోజనం వడ్డించి, కచ్చితంగా 1 గంటకి దూర ప్రాంతాల్లో ఉన్న క్లస్టర్ పాఠశాలల మీటింగ్‌కు హాజరుకావడం సులభతరం కాదన్నారు. క్లస్టర్ సమావేశాలు ఉన్న రోజుల్లో పాఠశాలలకు పూర్తి స్థాయిలో సెలవులు ప్రకటించి సమావేశాలు నిర్వహిస్తే బాగుంటుందన్నారు. అలాగే గతంలో లాగే సబ్జెక్టు ఉపాధ్యాయులకు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మైనర్ మీడియం ఉపాధ్యాయులకు యథావిధిగా పాఠశాల సముదాయాలను కొనసాగించాలని కోరారు.

హైరిస్క్ గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-తలుపుల

ప్రధానమంత్రి సురక్షా మాతృత్వ అభియాన్‌లో భాగంగా స్థానిక పిహెచ్‌సిలో ప్రతి నెలా మండలంలోని హై రిస్క్ గర్భిణులకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ అష్ఫాఫ్, డాక్టర్ ఆశ్రిత తెలిపారు. ఇందులో భాగంగా గురువారం వారు 98 మంది గర్భిణులను పరీక్షించి 19 మందిలో రక్త హీనత ఉన్నట్లు గుర్తించి ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్స్ ఇచ్చారు. 22 మందిని ఉచిత అల్ట్రా సౌండ్ స్కానింగ్ కోసం కదిరికి పంపారు. అలాగే ప్రసవ సమయం వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను తెలిపారు. మదర్ థెరెస్సా స్ఫూర్తితో మన్సూర్, వారి మిత్ర బృందం గర్భిణులు, వారితో వచ్చిన వారికి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది మొత్తం 175 మందికి ఉచితంగా భోజనం ఏర్పాటు చేశారు. ఏడాది పాటు భోజనం అందజేస్తామని వారు తెలిపారు.

గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న మన్సూర్ మిత్ర బృందం

లేఅవుట్లకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వేస్తున్న ప్లాట్లకు ప్రభుత్వ అనుమతి లేదని ఎంపిడిఒ అంజనప్ప స్పష్టం చేశారు. ఆయన గురువారం ఇవోఆర్డీ మాధవరెడ్డితో కలిసి సర్వే నంబర్లు 275, 276, 277, 278, 561, 562, 563లో అక్రమ లేఅవుట్ల వద్ద నాటుతున్న హద్దు రాళ్లను తొలగించారు. అనంతరం ఎంపిడిఒ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గ్రామ పంచాయతీ, అహుడా అనుమతి లేకుండా వేసే ప్లాట్లను అక్రమ లేఅవుట్‌గా పరిగణిస్తామన్నారు. అలాంటి లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ సౌకర్యాలు ఉండవన్నారు. అటువంటి అక్రమ నిర్మాణాలను ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా కూల్చివేసే అధికారం పంచాయతీ అధికారులకు ఉంటుందని హెచ్చరించారు. ఆయా సర్వే నెంబర్లలో రిజిస్ట్రేషన్ చేయవద్దని కదిరి సబ్ రిజిస్ట్రార్‌కి లేఖ పంపినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతి పొందిన తర్వాతనే ప్లాట్స్ వేసి క్రయ విక్రయాలు జరపాలని ఆదేశించారు.

లే అవుట్‌ను పరిశీలిస్తున్న ఎంపిడిఒ అంజనప్ప, ఈవోఆర్డీ

16న పుట్టపర్తిలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వెనుక భాగంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఈ నెల 16వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పిఆర్‌ఒ సంతోష్‌రెడ్డి తెలిపారు. జాబ్‌మేళాలో 50కి పైగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. జాబ్‌మేళా కోసం మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే నిరుద్యోగులు, కంపెనీ ప్రతినిధులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తారని తెలిపారు.

ఆసుపత్రిలో అన్నదానం

ప్రజాశక్తి-ధర్మారం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 300 మంది రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేసినట్లు ఫౌండేషన్ కోశాధికారి మోహన్‌గుప్తా, వైకె. శ్రీనివాసులు, రమేష్‌బాబు, మల్లికార్జున తెలిపారు. వారు మాట్లాడుతూ రేణిగుంట్ల బాల వెంకటయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు రేణిగుంట్ల శ్రీధర్ సహాయ సహకారాలతో అన్నదానం ఏర్పాటు చేశామని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ యువర్స్ ఫౌండేషన్ సేవలను కొనియాడారు.

గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు

'సంతాన సాఫల్య' శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-ధర్మారం టౌన్

పట్టణంలోని సాయినగర్‌లో ఉన్న స్పందన ఆసుపత్రిలో గురువారం ఇందిరా ఐవిఎఫ్ హాస్పిటల్ అనంతపురం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్య సలహా శిబిరానికి విశేష స్పందన వచ్చిందని డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. శిబిరంలో డాక్టర్ నిర్మల 48 మంది దంపతులకు సంతాన సాఫల్య విషయంలో జాగ్రత్తలు, మెలకులను తెలిపారు.

విద్యార్థులకు పెన్‌డ్రైవ్‌లు పంపిణీ చేస్తున్న మన్సూర్

మన్సూర్ దాతృత్వం

ప్రజాశక్తి-చిలమత్తూరు

స్థానిక బీసీ కాలనీకి చెందిన మన్సూర్ దాతృత్వం చాటుకున్నారు. ఆయన కుమారుడు శయన్ జన్మదినం సందర్భంగా గురువారం కొడికొండలోని సమర్థనం దివ్యాంగుల సంస్థలో కుటుంబ సభ్యులతో కలిసి దాదాపు రూ. 10 వేలు విలువచేసే పెన్ డ్రైవ్‌లను దివ్యాంగ విద్యార్థులకు పంపిణీ చేశారు. అలాగే వారి సమక్షంలో కేక్ కేట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో మన్సూర్ కుటుంబ సభ్యులు, ట్రైనర్ నరసింహమూర్తి, కవిత, శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి నడవడిక, సేవాభావం కలిగి ఉండాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రతి విద్యార్థి విద్యతో పాటు మంచి నడవడిక, సేవా భావం కలిగి ఉండాలని వక్తలు సూచించారు. మండలంలోని పెడపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. డిఆర్‌డిఎ పిడి నరసయ్య, డీఎస్పీ విజయ్ కుమార్, సిఐ సురేష్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు జయం అమర్నాథ్ ఆధ్వర్యంలో 15 మంది విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, జామెట్రీ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యత్‌తో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచాలని, తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవం కలిగి ఉండాలన్నారు. బాగా చదివి పాఠశాల, గ్రామం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమామణి రూరల్ సిఐ సురేష్, ఎస్ఐ లింగన్న, బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ పిడి చెన్నక్రిష్ణారెడ్డి, ఉపాధ్యాయులు నాగభూషణం, రామ్మూర్తి, సూర్యనారాయణ, సుగుణమ్మ, శేఖర్‌రెడ్డి, సోమశేఖర్‌రాజు, గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం అనంత శక్తి సొసైటీ ఆధ్వర్యంలో సీఈఓ లావణ్య అధ్యక్షతన సుశీలమ్మ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే మహిళల పట్ల వివక్ష, హింస, బాల్యవివాహాలు, సమానత్వం, నిర్ణయాధికారం, తదితర అంశాలపై నాటిక రూపంలో ప్రదర్శించారు. సమాజంలో అన్ని రంగాల్లో సమానత్వం కల్పించి ప్రోత్సహిస్తే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని సీఈఓ తెలిపారు. గౌరీ, రామలక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు చిన్ననాటి నుంచి ఆడ మగ తేడా లేకుండా పిల్లలను పెంచాలని, పనులు కూడా చేయించాలని, అప్పుడే సమానత్వం వస్తుందని తెలిపారు. మహిళలు ఏమాత్రం హింసకు గురి కావాల్సిన అవసరం లేదని, అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన పెంచుకొని సమాజంలో బతకాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, పాలకవర్గం సభ్యులు, మహాశక్తి నుంచి రవళి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఈఓ లావణ్య

ప్రతి రైతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని ప్రతి రైతు ఆ గ్రామానికి సంబంధించిన రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఈ నెల 25వ తేదీ లోపు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్‌రెడ్డి సూచించారు. ఈ రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాత ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య వస్తుందని, ఈ విశిష్ట సంఖ్య అర్హులైన భూమి ఉన్న రైతును గుర్తించడంలో తోడ్పడుతుందన్నారు. అలాగే వారికి ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ సబ్సిడీలు, పంటల బీమా, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలు పొందడానికి అధికారిక గుర్తింపుగా పని చేస్తుందన్నారు. రైతులు ఆధార్ నెంబర్, ఆధార్ అనుసంధానిత ఫోన్ నెంబరు, భూమి రికార్డుల వివరాలు(పట్టాదారు పాస్ బుక్) తీసుకుని గ్రామంలోని రైతు సేవా సిబ్బందికి ఇవ్వాలన్నారు. గ్రామంలో లేని రైతులు ఆర్ఎస్‌కె సిబ్బందిని ఫోన్‌లో సంప్రదించి తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

రైతు విశిష్ట నంబర్ ఉంటేనే పథకాల లబ్ధి

మడకశిర : వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు ప్రత్యేక గుర్తింపు నంబర్ కోసం నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులకు విశిష్ట నంబర్ ఉంటేనే ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందని తెలిపారు. మన్మందు కౌలు రైతులు, వ్యవసాయ కూలీ లకు ఇది వర్తిస్తుందని తెలిపారు.

శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జనరంజక పాలన అందించి ప్రజల మన్ననలు పొందిన శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ఈ నెల 16వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఘనంగా నిర్వహించాలని పుట్టపర్తి బలిజ సంఘం నాయకులు కోరారు. వారు గురువారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శ్రీకృష్ణదేవరాయలు జయంతి విషయమైన తీర్మానం చేసి ప్రభుత్వం, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌లకు లేఖలు పంపనున్నట్లు తెలిపారు. గతంలో టిడిపి హయాంలో ఓ సారి పెనుకొండలో పట్టాభిషేక మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారని గుర్తుచేశారు. సమావేశంలో సంఘం సభ్యులు చింతా దామోదర్, ఆకుల బాలగంగాధర్, శ్రీరాములు, ఆంజనేయులు, చలపతి, సాయికుమార్, రవికుమార్, డి.శంకర, ఓబుళపతి, వంశీకుమార్, రవికుమార్, శ్రీనివాసులు, కాన శ్రీనివాసులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బలిజ సంఘం నాయకులు

ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జిఎల్.నరసింహులు విమర్శించారు. స్థానిక సొసైటీ ఆవరణలో గురువారం సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల శాఖ సమావేశం నిర్వహించారు. జిఎల్.నరసింహులు మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను తప్పి స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని, విద్యుత్ ఛార్జీలను పెంచారన్నారు. ఇక ఉచిత గ్యాస్ సిలిండర్ డబ్బులు ఎవరికి పడుతున్నాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, తదితర హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, రైతు సంఘం పోతులయ్య, ఆవాజ్ కమిటీ కార్యదర్శి బాబ్‌జాన్, ఫక్రుద్దీన్, నౌషాద్, బాషా, బేల్దారి బాబావలి, చికెన్ రఫీ, టైలర్ ముత్తు, రహీం, ఫక్రుబి, ఇమాంబి, బాబా, హాజువలి, కదిరి సిఐటియు కోకన్వీనర్ ముస్తాక్, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

15న చంద్రాయునిస్వామి తడక మహోత్సవం

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండలంలోని చంద్రాయినిపల్లి గ్రామపరిధిలోని కొండల్లో వెలసిన చంద్రాయుని స్వామి తడక మహోత్సవం ఈ నెల 15వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారులు తెలిపారు. ఏటా మాఘ మాసంలో మూడవ శనివారం తడక మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ అని, ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ పూజారులు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గురువారం జిల్లా అధ్యక్షులు ఈరేష్ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హరి, కార్యదర్శిగా అర్జున్, ఏడుగురి సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కళాశాలలో రెండేళ్లుగా నిరుపయోగంగా ఉన్న జిమ్, స్పోర్ట్స్ రూమ్‌ను విద్యార్థి సంఘం నాయకులు తెరిపించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శు లు హరి, అర్జున్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు.

15న 'ప్రజా గ్రీవెన్స్'

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

టిడిపి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 15వ తేదీ స్థానిక ఐటిఐ కళాశాలలో 'ప్రజా గ్రీవెన్స్' నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రజాగ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఓడి చెరువు, అమడగూరు, నల్లమాడ మండలాల ప్రజలు ఈ ప్రజా గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రీవెన్స్‌లో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో పాటు ఆయా మండలాల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. గ్రీవెన్స్‌కు హాజరయ్యే వారికి భోజన సౌకర్యం కూడా కల్పిస్తారని తెలిపారు.

సాయిబాబా గుడికి విరాళాలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని సాయినగర్‌లో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయానికి గురువారం పలువురు విరాళాలు ఇచ్చినట్లు షిర్డీ సాయిబాబా సేవా సమితి సభ్యులు తెలిపారు. వారు మాట్లాడుతూ శివాలయం ప్రధాన ద్వారం కోసం ఇంటూరి నారాయణ రెడ్డి ఇంటూరి సరోజమ్మ జ్ఞాపకార్థం రూ. 1,00,116 విరాళంగా ఇచ్చారు. అలాగే ఆలయంలోని వినాయకుడి తొండానికి వెండి కవచం కోసం వెంకటరామయ్య, ఆయన భార్య చంద్రకళ రూ. 18,500 విరాళంగా అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు దాతలను ఘనంగా సన్మానించారు.

విద్యార్థి హేమంత్‌కుమార్‌తో ప్రిన్సిపల్ డా. కె.ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు

జాతీయ సమైక్యత శిబిరానికి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.కాం తృతీయ సంవత్సరం విద్యార్థి కట్టుబడి హేమంత్ కుమార్ జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డా. కె.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మహారాష్ట్రలోని శివాజీ యూనివర్సిటీ కొల్హాపూర్‌లో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకూ జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో హేమంత్‌కుమార్ పాల్గొంటాడని తెలిపారు. హేమంత్‌ను ప్రిన్సిపల్‌తో పాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. బి.గోపాల్‌నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని బడేనాయక్‌తండా ప్రాథమిక పాఠశాల, జగరాజు పల్లి కెజిబివి, మోడల్ స్కూళ్లను గురువారం ఎంఇఒ-2 ప్రసాద్ సందర్శించారు. బడేనాయక్‌తండా స్కూల్‌లో పిల్లల హాజరు, ఎండిఎం పిల్లల హాజరు శాతాన్ని పెంచుకోవాలని హెచ్‌ఎంకు సూచించారు. అనంతరం పాఠశాలలో జరుగు తున్న నాడు నేడు పనులను పరిశీలించి నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే కెజిబివిలో అర్థాంతరంగా ఆగిన భవనాలను పరిశీలించి పనులను పున:పరిశీలించేందుకు ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. మోడల్ స్కూల్‌లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపల్స్ సుప్రజ, రమేష్, వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం పరిశీలన

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక గ్రంథాలయాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ అధికారి రమాదేవి సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ సేవలను పాఠకులు ఏ విధంగా వినియోగించుకుంటున్నారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే విషయాన్ని గ్రంథాలయ అధికారి ఇబ్రహీంను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇబ్రహీం ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇబ్రహీం మాట్లాడుతూ పాఠకులు గ్రంథాలయంలో అమలవుతున్న సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-నల్లచెరువు

స్థానిక పిహెచ్‌సిలో గురువారం మండల వైద్యాధికారి డాక్టర్ కల్పనారెడ్డి ఆధ్వర్యంలో లీగల్ సెల్ మండల్ సర్వీసెస్ సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఎఎన్ఎం, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు ఇంటింటి సర్వే చేయాలన్నారు. అప్పుడే పుట్టిన శిశువుల్లో ఏవైనా లోపాలు ఉంటే గుర్తించాలని, సదరం క్యాంపులు, బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. రోగుల గురించి వైద్యాధికారికి తెలియజేస్తే స్క్రీనింగ్ నిర్వహిస్తార న్నారు. తహశీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ ఎఎన్ఎం, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు ఈ నెల 24వ తేదీ వరకూ గ్రామంలో ఇంటింటి సర్వే చేసి ఏవైనా కేసులు గుర్తిస్తే వారి వివరాలు ఇవ్వాలన్నారు. ఎంపిడిఒ గుప్తా మాట్లాడుతూ అందరూ కలిసిమెలసి పకడ్బందీగా సర్వే నిర్వహించాలన్నారు. సిహెచ్‌ఒ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సర్వేలో భాగంగా అనుమానితుల వివరాలను రికార్డులో నమోదు చేయాలన్నారు. ఈ నెల 24వ తేదీ సర్వే రిపోర్టులను తాలూకా లీగల్ సర్వీసెస్ ఛైర్మన్(జడ్జి)కి పంపాల్సి ఉంటుందన్నారు. సర్వేను తహశీల్దార్, ఎంపిడిఒ, మండల వైద్యాధికారి, సిహెచ్‌ఒ, ఏవో రామకృష్ణ పర్యవేక్షిస్తారని తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు

రోడ్డు ప్రమాదంలో తహశీల్దార్‌కు గాయాలు

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

కొత్తచెరువు తహశీల్దార్ నీలకంఠారెడ్డి గురువారం ఉదయం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. తహశీల్దార్ నీలకంఠారెడ్డి విధులకు హాజరయ్యేందుకు కారులో డ్రైవర్‌తో కలసి అనంతపురం నుంచి కొత్తచెరువుకు బయల్దేరారు. అలాగే ధర్మవరం డిప్యూటీ తహశీల్దార్ సురేష్ కారులో డ్రైవర్‌తో కలిసి పుట్టపర్తి నుంచి ధర్మవరం పట్టణానికి వెళ్తున్నారు. తహశీల్దార్ నీలకంఠారెడ్డి ప్రయాణిస్తున్న కారు మండలంలోని కొడపగానిపల్లి సమీపంలో ముందు వెళ్తున్న బస్సును దాటే క్రమంలో ఎదురుగా వచ్చిన డిటి సురేష్ కారును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తహశీల్దార్ నీలకంఠారెడ్డి తల, ఛాతి, చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. సమీప పొలాల్లో పని చేస్తున్న రైతులు వెంటనే అక్కడికి చేరుకుని పోలీసులు, అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అలాగే గాయపడిన తహశీల్దార్‌ను పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆయనను అనంతపురం తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఫోన్‌లో తహశీల్దార్‌ను పరామర్శించారు. డిటి సురేష్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే రెండు కార్లకు ముందు భాగాలు బాగా ధ్వంసమయ్యాయి. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తచెరువు పోలీసులు తెలిపారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

వేరుశనగ సాగుపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం కదిరి వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు ఆధ్వర్యంలో మండలంలోని రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ పంటలో యాజమాన్య పద్ధతులు, విత్తనోత్పత్తి, చీడపీడల నివారణ, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. రబీలో నూతన వంగడాలైన కదిరి లేపాక్షి, కదిరి చిత్రావతి, కదిరి అమరావతి, విశిష్ట రకాలను సాగు చేసుకోవాలన్నారు. చివరగా శాస్త్రవేత్తలు రైతుల సమస్యలు తెలుసుకొని పరిష్కరించారు. అలాగే పుట్టపర్తిలో ఉన్న ఏరువాక కేంద్రం సేవలను వివరించారు. కార్యక్రమంలో కదిరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బివి.భాస్కర్‌రెడ్డి, డాక్టర్ ఆర్.నరసింహులు, ఏరువాక శాస్త్రవేత్త పి.రామసుబ్బయ్య, పుట్టపర్తి మండల వ్యవసాయ అధికారి సి.వెంకటబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్‌కు సమస్యను వివరిస్తున్న పట్టణ ప్రజలు

'నీటి కోసం ఇబ్బంది పడుతున్నాం'..

ప్రజాశక్తి-హిందూపురం

నీటి కోసం తాము ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని స్థానికులు మున్సిపల్ ఛైర్మన్ డి.ఈ.రమేష్ కుమార్‌ను వేడుకున్నారు. వార్డు పర్యటనలో భాగంగా ఛైర్మన్, మున్సిపల్ అధికారులు గురువారం పురపాలక సంఘం పరిధిలో 35, 36 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా వార్డు ప్రజలు రోడ్లు ఏమాత్రం లేవని, మురికి కాలువలు లేకపోవడంతో రోడ్లపైనే నీరు వదులుకోవాల్సి వస్తోందని, పారిశుధ్యం అధ్వానంగా ఉందని, వీధి దీపాలు అరకొరగా వెలుగుతున్నాయన్నారు. ఆయా సౌకర్యాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. నీటి సమస్య జఠిలంగా ఉందని చెప్పారు. స్పందించిన ఛైర్మన్ అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం కోసమే ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నీరు, వీధి దీపాలు, రహదారులు, మురికి కాలువలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ శంకర్, కౌన్సిలర్ సతీష్ కుమార్, టిడిపి నాయకులు హరీష్, నాగేంద్ర, ప్రజలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామ వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్‌ను మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఆశ్వర్థప్ప ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, కమిషనర్ సంఘం శ్రీనివాసులు చేతుల మీదుగా గురువారం ఆవిష్కరణ చేశారు. ఛైర్మన్ మాట్లాడుతూ దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ దష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జేపీ రెడ్డి, సిరాల చంద్ర, ఆనంద్ రాజ్, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భార్యపై కొడవలితో దాడి

ప్రజాశక్తి-పరిగి

కూతురి వివాహ ఆహ్వాన పత్రిక ఇవ్వడానికి వెళ్లిన భార్యపై కొడవలితో దాడి చేసిన సంఘటన గురువారం మండలంలోని బీచిగానిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని బీచిగానిపల్లి గ్రామానికి చెందిన కర్రియన్న, హిందూపురం పట్టణానికి చెందిన నిర్మల భార్యాభర్తలు. వీరికి ఓ కుమార్తె, ఓ కుమారుడు ఉన్నారు. వారి మధ్య మనస్పర్థల కారణంగా నాలుగేళ్లుగా వేర్వేరుగా కాపురం ఉంటున్నారు. హిందూపురంలో నివాసం ఉంటున్న నిర్మల కూతురికి పెళ్లి నిశ్చయం కావడంతో వివాహ శుభలేక భర్తకు ఇవ్వడానికి బీచిగానిపల్లి గ్రామం వెళ్లింది. ఈ విషయంపై ఆగ్రహించిన కర్రియన్న కొడవలితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన నిర్మలను స్థానికులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిర్మల

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద రైల్వే ట్రాక్ సమీపంలో గురువారం పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 5,650, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సిఐ శివరాముడు తెలిపారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL. JUNIOR CIVIL JUDGE, PENUKONDA
O.S. No.254 / 2022

Between:
M.Ravi Sekhar Reddy ...Plaintiff
AND
S.Akbar Basha ...Defendent

NOTICE TO DEFENDENT

TO,
S.Akbar Basha S/o Late Alli Sab, Business, Pathikuntapalli Village, H/o Velidadakala, Somandepalli Mandal, Sri Sathya Sai Dist. Now R/o Bangalore City.

ఇందుమూలముగా ప్రతివాదికి తెలియజేయడము ఏమనగా వాది నీపై దావా మొత్తము రాబట్టుకొనుటకు గాను పై కోర్టులో దావా దాఖలు చేసి యున్నారు. సదరీ దావాలో నీకు ఎన్ని పర్యాయములు సమను పంపినను తీసుకొనక కాలహరణ చేయుచున్నారు. సదరు దావా మీ హాజరు నిమిత్తము 27/02/2025వ తేదిన వాయిదా వేసినారు. కావున నీవు 27/02/2025వ తేదిన పై కోర్టు నందు ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గాని వకీలు ద్వారా గాని హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలెయును. లేని యెడల దావా మీ పరోక్షములో తీర్మానించబడునని తెలియజేయడమైనది.

వాయిదా తేది:27/02/2025

(By order of the court)
C.NARENDRA REDDY
Advocate for Plaintiff, Penukonda